


రూ.25.79 కోట్ల విద్యాదీవెన లబ్ధి



ప్రజాశక్తి - తిరుపతి టౌన్

పశ్చిమగోదావరి జిల్లా భీమవరం నుండి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి విద్యాదీవెన నాలుగో విడత నిధులను బటన్‌నొక్కి తల్లుల ఖాతాలో జమ చేశారు. తిరుపతి కలెక్టరేట్‌లో కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి రూ.25.79 కోట్ల ఫీజు రియింబర్స్‌మెంట్ మెగా చెక్కును విద్యార్థులకు అందజేశారు. తల్లులు, విద్యార్థుల ఉమ్మడి ఖాతాల్లో జమ అయిన పది రోజుల్లోపు సంబంధిత కళాశాలలకు చెల్లించి తల్లులు సహకరించాలని, లేనిచో తదుపరి జగనన్న విద్యా దీవెన మొత్తాన్ని నేరుగా కళాశాలలకు చెల్లిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ సాధికార అధికారి చెన్నయ్య, జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

రోజు ఆదాయంలో ఏంత తేడానో..!

- అంబానీకి రూ.116 కోట్లు..
- అంగన్‌వాడీలకు రూ.300లేనా..!

శాంతియుతంగానే అంగన్‘వేడి’



శ్రీకాళహస్తిలో..

ప్రజాశక్తి - తిరుపతి టౌన్, యంత్రాంగం

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పాత మున్సిపల్‌క ఆర్యాలయం నుంచి శ్రీదేవి కాంప్లెక్స్, నాలుగు కాళ్ల మండపం మీదుగా ర్యాలీ జరిగింది. సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి కె.వేణుగోపాల్, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి కె.రాధాక్రిష్ణ మాట్లాడుతూ 18 రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా 56వేల సెంటర్లు మూత వేసుకుని లక్షా 50వేల మంది మహిళలు రోడ్లపైకొచ్చి ఆందోళన చేస్తున్నా ప్రభుత్వానికి పట్టడం లేదన్నారు. నాయకులు టి.సుబ్రమణ్యం, పి.బుజ్జి, ఎన్‌డి రవి, నాగరాజమ్మ, గోమతి పాల్గొన్నారు.

- పుత్తూరు టౌన్‌లో ‘సిఎం మనసు మార్చు ప్రభూ’ అంటూ ఏసుప్రభును ప్రార్థిస్తూ తహశీల్దార్ కార్యాలయం వద్ద దీక్షను కొనసాగించారు. అంగన్‌వాడీ నాయకులు మునికుమారి, విజయకుమారి, హైమావతి, జయంతి పాల్గొన్నారు.
- నారాయణవనంలో టిడిపి ఇన్‌ఛార్జి హెలెన్ హేమలత సంపూర్ణ మద్దతు తెలిపారు. అంగన్‌వాడీలు పద్మావతి, వాణి, సుశీల నాయకత్వంలో మోకాళ్లపై నిరసన తెలిపారు.
- వెంకటగిరి ఐసిడిఎస్ ఆఫీసు వద్ద దీక్షకొనసాగింది. మధ్యాహ్న భోజన పథకం కార్మికులు సంఘీభావం తెలిపారు. ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు ఎ.మంజు, ఎన్.స్వరూపరాణి, సుభాషిణి మాట్లాడుతూ అంగన్‌వాడీలకు వేతనాలు పెంచకపోతే ఏం తిని బతకాలని ప్రశ్నించారు. బెదిరించడం మానుకుని డిమాండ్లు పరిష్కరించాలన్నారు.
- పిచ్చాటూరులో మండల కార్యదర్శి రామచంద్రారెడ్డి, నాగరాజు, అంగన్‌వాడీలు ఇంద్రాణి, దుర్గా, గ్లోరీ, అముద ఆధ్వర్యంలో పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు.
- నాయుడుపేటలో సిఐటియు నాయకులు శివకవి ముకుంద, అంగన్‌వాడీ ప్రాజెక్టు కార్యదర్శి ఎన్.శ్యామలమ్మ ఆధ్వర్యంలో శిబిరం వద్ద గొబ్బెమ్మ పెట్టి దీక్ష కొనసాగించారు.
- శ్రీకాళహస్తిలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మాట్లాడుతూ అంగన్‌వాడీల పోరాటానికి ఎర్రజెండాలు అండగా ఉంటాయన్నారు. రోజుల తరబడి సమ్మె కొనసాగుతున్నా ప్రభుత్వంలో ఎలాంటి చలనం లేదనీ, మహిళలను కష్టపెడుతూ వేడుక చూస్తోందన్నారు. అంబానీ ఒక్కరోజు ఆదాయం రూ.116 కోట్లు, మరి అంగన్‌వాడీలు ఒక్కరోజు కూలి రూ.300లేనా అని ప్రశ్నించారు. అంగన్‌వాడీల సమ్మె 20వ రోజుకు చేరుకుంటున్నా ఏమాత్రం అలుపు సొలుపు లేదనీ, జగన్ అంతు చూసేవరకూ నిద్రపోరని స్పష్టంచేశారు. నాయకులు ప్రసాదరావు, అంగేరి పుల్లయ్య, రేవతి, పుష్ప,భారతి, సక్కుభాయమ్మ పాల్గొన్నారు.



కోటలో...




తిరుపతిలో ర్యాలీ

- గూడూరుటౌన్‌లో నాయకులు ఇంద్రావతి, సురేష్ ఆధ్వర్యంలో సమ్మె కొనసాగింది.
- కోటలో అంగన్‌వాడీలకు సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మద్దతు ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీలు చేస్తున్న నిరసన కార్యక్రమాలను చూసి ప్రభుత్వానికి వణుకు పుడుతోందన్నారు. రాష్ట్రంలో ఉండే లోపాలను గుర్తు చేస్తూ సిపిఎం జిల్లా అధ్యక్షులు వందవాసి నాగరాజు ఓ పాటను పాడుతూ స్థానిక అంగన్వాడీలను ఉత్సాహపరిచారు. సిఐటియు నాయకులు మునిరాజా, జిల్లా అంగన్వాడి ప్రధాన కార్యదర్శి ఎస్.వాణిశ్రీ, ఉపాధ్యక్షులు ముని కుమారి, యుటిఎఫ్ జనరల్ సెక్రటరీ టి.భాస్కరరావు, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి మస్తానయ్య, అంగన్వాడి జిల్లా అధ్యక్షురాలు పద్మలీలమ్మ, సరోజిని, విజయమ్మ పాల్గొన్నారు.

ఒక్క ఛాన్స్ చివరి ఛాన్స్ కావాలి

- భూములు దోచేందుకే ల్యాండ్ టైటిల్‌చట్టం
- రైతుల పంటలకు ఎయిర్‌పోర్టు పూర్తిచేస్తాం
- అంగన్‌వాడీల సమస్యలు న్యాయమైనవి
- కుప్పంలో లక్ష మెజార్టీ వస్తే 175 మనవే
- శాంతిపురం, రామకుప్పం సభల్లో చంద్రబాబు



ప్రజాశక్తి - శాంతిపురం, రామకుప్పం

జగన్ లాంటి పాలకుడు రాజకీయాలకు అనర్హుడని టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు దుయ్యబట్టారు. ఎన్నికలకు ముందు జగన్ అడిగిన ఒక్క ఛాన్స్ చివరి ఛాన్స్ కావాలన్నారు. కుప్పం నియోజకవర్గ పర్యటనలో భాగంగా రెండోరోజు శుక్రవారం శాంతిపురం, రామకుప్పంలలో రోడ్డుషో సభలు జరిగాయి. శాంతిపురంలో అంగన్‌వాడీ శిబిరం వద్దకు నేరుగా వెళ్లి మద్దతు ప్రకటించారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం రోడ్డుషో సభల్లో ‘స్థానికత’ను ప్రస్తావిస్తూ ప్రసంగించారు. కుప్పంలో లక్ష మెజార్టీ వస్తే 175 స్థానాలు మనవేనని అన్నారు. ‘శాంతిపురం నాకు కొత్త కాదు.. ఎపుడూ వస్తూనే ఉంటాను. కానీ మీలో ఈసారి ప్రత్యేకమైన అభిమానం కనబడుతోంది.. మిమ్మల్నిచూస్తుంటే నాకు చాలా ధైర్యంగా ఉంది.. నిన్న, నేడు మీ ఉత్సాహం చూశాక మన కుప్పంలో టిడిపికి లక్ష ఓట్ల మెజార్టీ కష్టం కాదనిపిస్తోంది. ఎపుడు ఎన్నికలు జరిగినా టిడిపి జెండా రెపరెపలాడే నియోజకవర్గాలు రెండున్నాయి. ఒకటి కుప్పం, రెండోది హిందూపురం. హిందూపురం ఎన్టీఆర్ ప్రాతినిధ్యం వహించిన నియోజకవర్గం. రెండోది మీ అభిమానంతో నేను గెలిచే కుప్పం నియోజకవర్గం’ అని శ్రేణులను ఉత్సాహపరిచారు. వైసిపి హయాంలో 13 శాతం పనులు పూర్తి చేసి హంద్రీనీవా నీటిని కుప్పంకు తీసుకురాలేకపోయారన్నారు. కుప్పంలో పట్టు పరిశ్రమ తీసుకురావడమే తన లక్ష్యమని, ఎయిర్‌పోర్టు నిర్మాణం పూర్తి చేసి రైతుల ఉత్పత్తులు ప్రపంచ నలుమూలలకు ఎగుమతులు చేసేలా చర్యలు తీసుకుంటానన్నారు. ఇసుక, మైనింగ్ ఏది వీళ్ల కళ్లల్లో పడినా మటాష్ అన్నారు. ఐదేళ్లుగా కుప్పంలో రౌడీయిజం, కబ్జాలు పెరిగాయన్నారు. పెద్దిరెడ్డి వేల కోట్లు దోచుకున్నారని, ఆయన ఇంట్లో మంత్రి, ఎంఎల్‌ఎ, ఎంపి ఉన్నారన్నారు. సాక్షి విలేకరి ఎచ్చర్లలో ఎంఎల్‌ఎ వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుని చనిపోయాడని, శ్రీకాళహస్తి ఎంఎల్‌ఎ పిఎ కూడా ఆత్మహత్య చేసుకున్నాడు. వైసిపి వాళ్లను తాను సిఎం అయ్యాక వదిలిపెట్టనన్నారు. రాష్ట్రాన్ని రక్షించుకోడానికి ఇంటికొకరు తయారవ్వాలి.. భయపడితే భవిష్యత్ ఉండదని అన్నారు.

టిడిపిలో చేరికలు

కుప్పం నియోజకవర్గంలో చంద్రబాబు రెండో రోజు పర్యటనలో భాగంగా శుక్రవారం ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నందు నియోజకవర్గ ప్రజల అర్జీలు స్వీకరించారు. చంద్రబాబు మాట్లాడుతూ ‘ప్రతి ఒక్కరికీ నూరు రోజుల తర్వాత న్యాయం జరుగుతుందని... నూరు రోజుల తర్వాత ... మన ప్రభుత్వం వస్తుందని తప్పక ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుంది’ అని పేర్కొన్నారు. కుప్పం నియోజకవర్గ దళిత నాయకులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించి దళిత సోదరులకు ప్రభుత్వం వస్తే ఎలాంటి కార్యక్రమాలు చేస్తామని విషయాలను వారికి క్షుణ్ణంగా వివరించారు. వైసిపి అసంతృప్తి నాయకులను 210 మందిని టిడిపిలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురేష్, కన్నన్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు. శాంతిపురం లక్ష్మీ థియేటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 200 మంది టిడిపిలో చేరారు.

మున్సిపల్‌కార్మికులను పర్మినెంట్ చేయాలి

ప్రజాశక్తి - నాయుడుపేట, యంత్రాంగం


మున్సిపల్ కార్మికులను పర్మినెంట్‌చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వందవాసి నాగరాజు డిమాండ్‌చేశారు. నాయుడుపేటలో మున్సిపల్‌కార్మికుల దీక్షా శిబిరం వద్ద సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వందవాసి నాగరాజు మాట్లాడుతూ మున్సిపల్‌కార్మికులు సమాజంలో చెత్తాచెదారాలు, మలినాన్ని శుభ్రపరచి గౌరవమైన జీవనాన్ని కొనసాగిస్తుంటే వాళ్లకు కనీస వేతనాలు లేకపోవడం దుర్మార్గమన్నారు. కాంట్రాక్టర్లు కోట్ల రూపాయలు దోచుకుంటున్నారన్నారు. మాట తప్పను మడమ తిపపను అని చెప్పి అధికారంలోకి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి గిరగిరా తిరుగుతున్నాడని ఎద్దేవాచేశారు. నాయుడుపేట మున్సిపాలిటీలో కాంట్రాక్టర్లు లక్షల రూపాయలు మెక్కుతున్నారని, స్వర్ణముఖి ఇసుకలో రోజుకు లక్షల రూపాయలు గడిస్తున్నారని, మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం, గ్లౌజులు, పాదరక్షలు ఇవ్వలేని దుస్థితిలో ఉన్నారన్నారు. మున్సిపల్‌కార్మికుల సమస్యలను పరిష్కరించని పక్షంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర కోశాధికారి వాణిశ్రీ, సిఐటియు నాయకులు మునిరాజా మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం ఉందా అని ప్రశ్నించారు. కొన్ని రోజులుగా అంగన్‌వాడీలు, మున్సిపల్‌కార్మికులు, విఆర్‌ఎలు పోరాటాలు చేస్తుంటే ప్రభుత్వం మొద్దునిద్ర పోతుందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు చాపల వెంకటేశ్వర్లు, శివకవి, ముకుంద, శ్యామలమ్మ, పారిశుధ్య కార్మికులు వెంకటరత్నం, నెలవల మస్తానయ్య, సీనయ్య పాల్గొన్నారు.

- గూడూరు టౌన్‌లో పారిశుధ్య కార్మికులు తలకు ఉరితాళ్లను బిగించుకుని వినూత్నంగా నిరసన తెలిపారు. కనీస వేతనం ఇవ్వకుంటే తమకు ఉరే గతి అని వాపోయారు. మున్సిపల్ కార్మికుల సమ్మెనాలుగో రోజుకు చేరుకుంది. మున్సిపల్ కార్మికుల యూనియన్ రాష్ట్ర నాయకులు బి.గోపీనాథ్ మాట్లాడుతూ సిఎం హామీలు ఇచ్చి నాలుగున్నరేళ్లయినా ఏ ఒక్క హామీని నెరవేర్చలేదన్నారు. కరోనా కాలంలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులు ఫ్రంట్‌లైన్ వారియర్స్ అని అభినందించారన్నారు. అయితే వారిని పర్మినెంట్ చేయడానికి, కనీస వేతనం ఇవ్వడానికి, హెల్త్ రిస్క్ అలవెన్స్ ఇవ్వడానికి జగన్మోహన్‌రెడ్డికి మనసొప్పడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బి.రమేష్, ధారా కోటేశ్వరరావు, బివి రమణయ్య, బి.ప్రభావతి, ఎం.సంపూర్ణమ్మ పాల్గొన్నారు.
- సూళ్లూరుపేటలో డ్యూటీ నుండి ఆఫ్‌లో ఉన్న ఇంజినీరింగ్ కార్మికులు, మేస్త్రిలు సమ్మెలో ఉన్న పారిశుధ్య కార్మికులకు సంఘీభావం ప్రకటించారు. నాయకులు కె.సాంబశివయ్య, బి.పద్మనాభయ్య, రామయ్య మాట్లాడుతూ ఇంజినీరింగ్ కార్మికులకు సర్వీసును బట్టి సెమి స్కిల్డ్ ఉద్యోగోన్నతికి అర్హులన్నారు.
- వెంకటగిరిలో మెడకు ఉరితాళ్లు తగిలించుకుని నిరసన తెలిపారు. సిఐటియు నాయకులు వడ్డిపల్లి చెంగయ్య, యూనియన్ నాయకులు టి.సుబ్బయ్య, ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ పాదయాత్ర సందర్భంగా మున్సిపల్ కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్‌కార్మికులందరినీ పర్మినెంట్ చేస్తానని చెప్పిన హామీని జగన్మోహన్‌రెడ్డి అమలుచేయాలన్నారు.



వెంకటగిరిలో ఉరే మాకు గతి అంటూ వినూత్న నిరసన

తిరుపతిలో కోవిడ్ బారిన నలుగురు



ప్రజాశక్తి -తిరుపతి సిటీ

దేశంలో కరోనా కేసులు పెరుగుతుండడంతో అన్ని రాష్ట్రాలు అప్రమత్తమయ్యాయి. ఇప్పటికే కేరళ, కర్ణాటకలో కొన్ని కేసులు ఉన్నట్లు వెల్లడయింది. ఆంధ్రప్రదేశ్లో మొట్టమొదటిసారి తిరుపతి నగరంలో నలుగురు అనుమానితులకు కోవిడ్ లక్షణాలు ఉండటంతో వైద్యాధికారులు వారిని ఐసోలేషన్లో ఉంచి చికిత్స అందిస్తున్నారు. రుయా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ రోగికి కోవిడ్ లక్షణాలు ఉండడంతో స్పందించిన వైద్యులు రాపిడ్ కిట్లతో పరీక్ష నిర్వహించారు. అతనికి పాజిటివ్ రావడంతో వెనివెంటనే ఐసోలేషన్ కి పంపించారు. అనంతపురం జిల్లాకు చెందిన దంపతులు బెంగళూరులో ఉంటూ ఇటీవల తిరుమలకు వచ్చారు. అక్కడ లగేజ్ లు మోసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆ దంపతుల్లో మహిళకు కోవిడ్ లక్షణాలు ఉండటంతో గురువారం రాత్రి రుయా కి వచ్చారు. వీరికి రాపిడ్ టెస్ట్ ద్వారా పరీక్షించగా కోవిడ్ పాజిటివ్ రావడంతో ఐసోలేషన్ కి పంపించారు. భర్తను అబ్జర్వేషన్ లో ఉంచారు. తిరుపతి నగరానికి చెందిన మరో ఇద్దరు దంపతులు కోవిడ్ లక్షణాలతో రుయా కు వచ్చి రాపిడ్ టెస్ట్ నిర్వహించుకున్నారు. వారిరువురికి పాజిటివ్ రావడంతో వైద్యుల సలహా మేరకు వారు ఇంటిలోనే హౌస్ ఐసోలేషన్ లో ఉన్నారు. నలుగురి స్వాబ్ లను ఆర్టిఫీసర్ పరీక్షల నిమిత్తం, నిర్ధారణ కోసం సిమ్స్ ఆసుపత్రులకు పంపారు. ఫలితాలు రావాల్సి ఉంది. ఈ సందర్భంగా వైద్య అధికారులు మాట్లాడుతూ కరోనా లక్షణాలున్న నలుగురు అనుమానితులను ఐసోలేషన్ లో ఉంచి చికిత్స అందిస్తున్నామని. ఆర్టిఫీసర్ టెస్ట్ ఫలితం కోసం వేచి ఉన్నామన్నారు. తిరుపతిలోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు ఆసుపత్రులలో అప్రమత్తం చేశామన్నారు. ప్రజలు భయపడాల్సిన పనిలేదని ఎలాంటి ఇబ్బందులు వచ్చినా ఎదుర్కొనేందుకు వైద్య సిబ్బంది సిద్ధంగా ఉన్నారని భరోసా ఇచ్చారు.



ఓజిలి-నాయుడుపేట ప్రధాన రహదారి

రహదారి మరమ్మతుకు ‘మోక్షం’ లేదు

ప్రజాశక్తి - ఓజిలి

మిచౌంగ్ తుపాను సృష్టించిన బీభత్సానికి ఓజిలి నుంచి నాయుడుపేట వెళ్లే ప్రధాన రహదారి సగభాగం పూర్తిగా దెబ్బతింది. అయితే ఈ రహదారి మరమ్మతుకు మోక్షం లేదని స్థానికులు ‘ఫిక్స్’ అయిపోయారు. సగం దారి కొట్టుకుపోయి ప్రమాదాలకు నిలయంగా ఉన్నా ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు. రహదారుల్లో ప్రమాదాలు జరగకుండా కలెక్టరేట్లో కూర్చుని సమీక్షలు చేస్తున్నారే తప్ప, ప్రమాదాలకు కారణాలేంటో క్షేత్రస్థాయిలో పరిశీలన లేదని ఈ ఆర్ అండ్ బి రోడ్డు చూస్తేనే అర్థమవుతుంది. దీనికితోడు చెరువులోని నీటి అలల తాకిడికి చెరువుకు ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యానికి వాహనదారులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ఈ దారిలో ప్రయాణం చేస్తున్నారు. మిచౌంగ్ తుపాను కారణంగా పెద్దచెరువు కట్ట కోతకు గురై తెగిపోయేందుకు సిద్ధంగా ఉన్న సమయంలో తూతూమంత్రంగా ఇసుక బస్తాలు వేసి ఇరిగేషన్ అధికారులు చేతులు దులుపుకున్నారని, శాశ్వత పరిష్కారం చేయడంలో విఫలమయ్యారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పెద్ద చెరువు ఆయకట్టు ద్వారా దాదాపు వెయ్యి ఎకరాలకు పైన సాగు భూములకు నీరందిస్తున్నారు. ప్రస్తుతం అదే చెరువు ప్రమాదపు అంచుల్లో ఉందని రైతులు వాపోతున్నారు. దశాబ్దాల క్రితం పెద్ద చెరువు ఆయకట్టుపై అప్పట్లో రవాణా మార్గం కోసం ఆర్ అండ్ బి రహదారిని ఏర్పాటుచేశారు. ఈర హదారిలో ప్రతిరోజూ వందలాది వాహనాలు తిరగడమే కాకుండా మండల కేంద్రం కావడంతో సుదూర ప్రాంతాల నుంచి ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. తుపాను కారణంగా ఈ రహదారి సగభాగం వరద తాకిడికి కొట్టుకుపోయింది. అప్పటినుంచి ఇప్పటివరకూ ఈ రహదారి మరమ్మతు పట్టించుకున్న నాధుడే లేదని వాహనదారులు మండిపడుతున్నారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మెకు బిఆర్ఎస్ మద్దతు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

ఎస్ఎస్ఎ ఉద్యోగుల సమ్మెకు తిరుపతి బిఆర్ఎస్ పార్టీ మద్దతు పలికింది. తిరుపతి తిలక్ రోడ్డు పాత మునిసిపల్ ఆఫీస్ సర్కిల్ నందు సమ్మె చేస్తున్న ఎస్ఎస్ఎ ఉద్యోగులకు బిఆర్ఎస్ రాష్ట్రనాయకులు ఆర్కాట్ కృష్ణప్రసాద్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఎంప్లాయిస్ వెల్ఫేర్ సొసైటీ, ఐక్య కార్యాచరణ సమితి తిరుపతి జిల్లాలోని 34 మండలాల్లో పనిచేస్తున్నటువంటి వివిధ విభాగాల్లోని సమగ్ర శిక్ష ఉద్యోగులు డిసెంబర్ 16 నుండి 19వ తేదీ వరకు పెన్డౌన్ సహాయ నిరాకరణ, 20వ తారీకు నుండి నిరవధిక సమ్మె చేస్తున్నారన్నారు. వారి ప్రధాన డిమాండ్ ఉద్యోగ భద్రత కల్పించాలన్నదేనన్నారు. మద్దతుగా రాఘవరెడ్డి, గురునాథం, రాజేంద్ర, రామారావు పాల్గొన్నారు.



వడ్డీ లేకుండా ఆస్తి పన్ను చెల్లింపు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

2023-24 రెండో అర్ధ సంవత్సరానికి వడ్డీ లేకుండా పన్ను చెల్లింపుకు ఈ నెలాఖరు 31 వ తేది వరకు గడువు ఉందని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. తిరుపతి నగర పాలక సంస్థ కార్యాలయంలో ప్రత్యేకంగా పన్ను చెల్లించడానికి నాలుగు ప్రత్యేక క్యాష్ కౌంటర్లు ఏర్పాటు చేశామని కమిషనర్ తెలిపారు. అలాగే డిసెంబర్ 31 ఆదివారం చివరి రోజు కనుక సెలవు రోజు అయినప్పటికీ క్యాష్ కౌంటర్లు యధావిధిగా పని చేస్తాయన్నారు. కావున నగర పాలక సంస్థకు చెల్లించవలసిన ఆస్తి పన్ను, నీటి పన్ను, ఖాళీ స్థలం పన్ను చెల్లించి నగరాభివద్ధికి సహకరించాలని కోరారు. పన్ను చెల్లింపుదార్లకు అనుకూలంగా క్యాష్ కౌంటర్లు ఉదయం 8 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు పని చేస్తాయని తెలిపారు.

పరంఫేవర్స్ రోడ్డు పనులు పరిశీలన

తిరుపతి టౌన్: రహదారుల నిర్మాణంలో నూతన టెక్నాలజితో నిర్మిస్తున్న పరంఫేవర్స్ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం కమిషనర్ హరిత పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఆరవ డివిజన్ నవోదయ కాలనీలో 330 మీటర్ల పొడవుతో ఆధునిక నూతన టెక్నాలజీతో రోడ్డును నిర్మిస్తున్నట్లు తెలిపారు. పరంఫేవర్స్ టెక్నాలజీతో నిర్మిస్తున్న ఈ రోడ్డుపై వర్షం నీరు నిలబడదని, మొత్తం నీరు రోడ్డులో ఇంకిపోవడంతో సమీప ప్రాంతాల్లో భూగర్భ జలాలు నిల్వ వుండేందుకు ఎక్కువ అవకాశం వుందన్నారు. ఈ నూతన టెక్నాలజీతో నిర్మిస్తున్న రోడ్డు వలన పూర్తి ప్రయోజనం కలిగితే, మరిన్ని పరంఫేవర్స్ రహదారుల నిర్మాణాలు చేపడుతామన్నారు. నగరపాలక సంస్థ మునిసిపల్ ఇంజనీర్ చంద్రశేఖర్, డిఈ సంజీవ్ కుమార్ కు ఆదేశాలు జారీ చేస్తూ మరో పది రోజుల్లోపు రోడ్డు పనులు పూర్తి చేయాలన్నారు.



సామాన్య భక్తులకే ప్రాధాన్యం

అచ్యుతం, శ్రీపథం బ్లాక్‌ల నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - తిరుపతి సిటి

తిరుమల శ్రీవారి దర్శనార్థం ప్రపంచం నలుమూలల నుండి విచ్చేసే వేలాది మంది భక్తులకు తిరుపతిలో మరింత సౌకర్యవంతంగా వసతి కల్పించేందుకు టీటీడీ అచ్యుతం, శ్రీపథం వసతి సముదాయాలు నిర్మిస్తున్నట్లు టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర రెడ్డి చెప్పారు. తిరుపతిలోని శ్రీ గోవింద రాజస్వామి(రెండు), శ్రీ కోదండరామస్వామి (మూడు) సత్రాల స్థానంలో అచ్యుతం, శ్రీపథం వసతి సముదాయాల నిర్మాణానికి టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర రెడ్డి, ఈవో ఎవి ధర్మారెడ్డి తో కలసి శుక్రవారం శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మీడియాతో మాట్లాడుతూ సామాన్య భక్తులకు ప్రాధాన్యం ఇస్తూ ఎలాంటి అసౌకర్యం కలగకుండా శ్రీవారి దర్శనం, అన్నప్రసాదం, బస తదితర సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. భక్తులకు మరింత మెరుగ్గా బస కల్పించడంలో భాగంగా తిరుమల, తిరుపతిలో ఉన్న విశ్రాంతి గృహాల్లో అవసరమైన వాటిని ఆధునీకరిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా తిరుపతిలో దాదాపు 70 సంవత్సరాల క్రితం నిర్మించిన శ్రీ గోవిందరాజస్వామి సత్రం (రెండో సత్రం) స్థానంలో రూ.209 కోట్లతో అచ్యుతం, శ్రీ కోదండరామస్వామి సత్రం(మూడో సత్రం) స్థానంలో రూ.209 కోట్లతో శ్రీపథం వసతి సముదాయాలు నిర్మించాలని టీటీడీ నిర్ణయించిందన్నారు. ఒక్కో బ్లాకులో 4100 మంది చొప్పున మొత్తం 8200 మంది భక్తులు ఇక్కడ బస చేసే అవకాశముందన్నారు. ఇందులో దాదాపు 200కు పైగా కార్లు, ద్విచక్రవాహనాలు పార్కింగ్ చేసుకునే అవకాశం ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మేయర్ డాక్టర్ శిరీష, డెప్యూటీ మేయర్ అభినయ్ రెడ్డి, జేఈవోలు సదా భార్గవి, వీరబ్రహ్మం, సివిఎస్వో నరసింహ కిషోర్, సిఈ నాగేశ్వరరావు, ఎస్ఈ (ఎలక్ట్రికల్) వెంకటేశ్వర్లు, ఈఈ వేణుగోపాల్ పాల్గొన్నారు.



టాస్క్ ఫోర్సు ఎస్పీగా పి. శ్రీనివాస్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)



ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక టాస్క్ ఫోర్సు (ఆర్ఎస్ఎఎస్టీఎఫ్) ఎస్పీగా పి.శ్రీనివాస్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కాకినాడ అదనపు ఎస్పీగా పని చేస్తూ టాస్క్ పోర్సు ఎస్పీగా శ్రీనివాస్ పదోన్నతి పొందారు. ఎస్పీ శ్రీనివాస్ మాట్లాడుతూ శేషాచలం అడవుల్లోని ఎర్రచందనం సంపదను స్మగ్లర్లు కొల్లగొట్టకుండా ఉండేందుకు తన వంతుగా కార్యాచరణతో పనిచేస్తానని చెప్పారు. టాస్క్ ఫోర్సు అధికారులు, సిబ్బందితో సమన్వయం చేసుకుని ఎర్రచందనం వక్షాలను కాపాడుతామన్నారు. కూంబింగ్ ఆపరేషన్లు పెంచి, సాంకేతికతను ఉపయోగించుకుంటామన్నారు. ఇంటర్ స్టేట్ ఆపరేషన్లు, ఇతర శాఖల సహకారంతో సమర్థవంతంగా విధులు చేపడుతామన్నారు. బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా డీఎస్పీలు మురలీధర్, చెంచుబాబు, రిజర్వు ఆర్ఐ సురేష్ కుమార్ రెడ్డి, సీఐలు శ్రీనివాసులు, సురేష్ కుమార్, ఏసీఎఫ్ జే.శ్రీనివాస్, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు పుష్పగుచ్చాలతో స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

స్విమ్స్ దారిలో దుర్గంధం

ముక్కు మూసుకెళుతున్న రోగులు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

రాష్ట్రంలోనే పేరు గడించిన శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) ప్రధాన రహదారి గత రెండు రోజులుగా డ్రైనేజీ కాలువ ఉప్పొంగడంతో దుర్గంధం వెదజల్లుతోంది. ఈ ఆసుపత్రికి నిత్యం వేలాది మంది రోగులు చికిత్స కోసం వస్తుంటారు. దీని పక్కనే బర్డు ఆసుపత్రి, శ్రీ పద్మావతి మహిళ వైద్య కళాశాల ఆసుపత్రి, శ్రీ పద్మావతి చిన్నపిల్లల హదయాలయం వంటి ఆసుపత్రులు పక్కపక్కనే ఉండడంతో నిత్యం వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. రకరకాల వ్యాధులతో వస్తున్న రోగులకు, ఏ చిన్న ఇబ్బంది కలిగిన ఇన్ఫెక్షన్ బారినపడి వ్యాధి మరింత తీవ్రతరం అవుతుంది. అందుకే ఆసుపత్రులన్నీ నిత్యం పరిశుభ్రంగా ఉంచుతుంటారు. కానీ స్విమ్స్ పరిపాలన భవనం ముందు, సాక్షాత్తు డైరెక్టర్ ఛాంబర్ ఎదుట డ్రైనేజీ ఉప్పొంగి రోడ్డు మొత్తం ప్రవహిస్తోంది. బర్డు ఆసుపత్రి నుంచి ఈ ప్రవాహం స్విమ్స్, ఫిజియోథెరపి కళాశాల, ఒపీ విభాగం, అత్యవసర విభాగం, క్యాంటీన్, ఎస్వీ ఆయుర్వేద ఆసుపత్రి మీదగా రోడ్డుపై దాదాపు కిలోమీటర్ పైగా క్రైమ్ స్టేషన్ వరకు ఈ డ్రైనేజీ నీరు రోడ్డుపై ప్రవహిస్తూ అత్యంత దుర్గందాన్ని వెదజల్లుతోంది. రోగులు వాహనదారులు రోడ్డుపై ప్రయాణించేందుకు అవస్థలు పడుతున్నారు. పక్కనే క్యాంటీన్ ఉండడంతో విధి లేని పరిస్థితుల్లో దుర్వాసనను భరిస్తూనే ఆహారం తినాల్సిన పరిస్థితి ఏర్పడింది. సుమారు 3వేల మంది పైగా పారిశుద్ధ కార్మికులు స్విమ్స్ ఆసుపత్రిలో పనిచేస్తున్నారు. అధికారులు వారి ద్వారా ప్రత్యమ్మయ మార్గాల్లో కూడా అన్వేషించకుండా, నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం గమనార్హం. అధికారుల నిర్లక్ష్యం వల్ల రోగులు వారి సహాయకులు, వైద్యులు, సిబ్బంది, వైద్య విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, రోడ్డుపై డ్రైనేజీ నీరు ప్రవహించకుండా, ప్రత్యేమ్నాయ మార్గాలు చూసి, డ్రైనేజీ నీరును మరో దిశగా మళ్ళించాలని పలువురు కోరుతున్నారు.



స్విమ్స్‌కు వెళ్లేదారిలో మురుగు

ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణపై శ్రద్ధ ఉండదా?

కమిషనర్‌ను ప్రశ్నించిన మున్సిపల్ వైస్ చైర్మన్ ఎస్‌కె రఫీ


విలేకరులతో మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ ఎస్‌కె రఫీ

ప్రజాశక్తి - నాయుడుపేట: 'ప్రయివేట్ వ్యక్తుల ఆస్తుల పరి రక్షణపై ఉన్న శ్రద్ధ ప్రభుత్వ ఆస్తులపై ఉండదా?' అని మున్సిపల్ వైస్ చైర్మన్ ఎస్‌కె రఫీ నాయుడుపేట మున్సిపల్ కమిషనర్‌ని ప్రశ్నించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత కొన్ని ఏళ్లుగా నాయుడుపేట ఆర్టీసీ బస్టాండ్ వద్ద రోడ్డుపై నివసిస్తున్న నక్కల వాళ్లని నాయుడుపేట డీఎస్పీ రాజగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ పోలీస్ బలగాలతో మున్సిపల్ కమిషనర్ వి శ్రీనివాసరావు ఖాళీ చేయించి వేరొక చోటికి పంపించడం అన్యాయమన్నారు. ఎన్నో ఏళ్లుగా వాళ్లని అక్కడ నుంచి మరొకచోటుకు మార్పించేందుకు గతంలో కమిషనర్లు చేసిన ప్రయత్నం విఫలమైందంటే వాళ్లకు ఉదయం భారీ పోలీసుల బందోబస్తుతో ఖాళీ చేయించి వాళ్లని మరో చోటికి పంపించారు. ఈ నేపథ్యంలో నాయుడుపేట మున్సిపాలిటీ వైస్ చైర్మన్ ఎస్ కె రఫీ ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ ఒక ప్రైవేట్ వ్యక్తి కోసం ఆఘామేఘాలపై నక్కల వాళ్లపై అధికారులు అనుసరించిన కర్కశ విధానాన్ని దుయ్యబట్టారు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం సంచార జాతుల వారికి సంబంధించిన స్థలానికి దారి మాత్రమే ఏర్పాటు చేయాలని స్పష్టంగా ఉందని అలాకాకుండా సంచార జాతుల వారిని పూర్తిగా ఖాళీ చేయించి ఆయనకు స్థలాన్ని అప్పగించాలని ఎక్కడా సూచించ లేదన్నారు. కోట్ల విలువ చేసే ఆ స్థలాన్ని మొత్తం ఆయన చేతిలో పెట్టమని ఎక్కడా సూచించ లేదన్నారు. గత 40 సంవత్సరాల నుండి ఆ ప్రభుత్వ స్థలానికి సంచార జాతుల వారే కాపలాదారులుగా ఉన్నారని, ప్రత్యక్షంగా నో పరోక్షంగానో వారు ప్రభుత్వ భూమిని కాపాడారన్నారు. ఇప్పుడు ఆ స్థలం మొత్తాన్ని ఓ ప్రైవేటు వ్యక్తి చేతిలో పెట్టేందుకు అధికారులు తెరతీసి వేయడం దురదృష్ట కరమన్నారు. ఆ ప్రభుత్వ భూమి 30 అంకణాల స్థలంలో 10 అడుగుల లేదా 14 అడుగుల రోడ్డు వేసి దారి చూపించాలని, మిగిలిన స్థలంలో దుకాణ సముదాయం ఏర్పాటు చేయాలని సూచించారు. అక్కడ ఆ ప్రభుత్వ భూమిలో 9 దుకాణాలు నిర్మించినా ఒక్కో దుకాణానికి పదివేల రూపాయలు చొప్పున నెలకి 90 వేల రూపాయలు మున్సిపాలిటీకి ఆదాయం వస్తుందన్నారు. సుమారు రూ.15 కోట్ల విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని ఆ ప్రైవేటు వ్యక్తికి ధారా దత్తం చేస్తున్నారా? లేక ఆ వ్యక్తులు ఊడిగం చేస్తున్నారో చెప్పాలని సూటిగా ప్రశ్నించారు.

మంత్రిని కలిసిన ఎస్వీయూ విసి శ్రీకాంత్ రెడ్డి


మంత్రికి అభినందనలు తెలుపుతున్న విసి

ప్రజాశక్తి - క్యాంపస్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇంధన వనరులు, అటవీ, గనుల మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని తిరుపతిలోని ఆయన కార్యాలయంలో ఎస్వీయూ ఉపకులపతి ఆచార్య వంగిమళ్ల శ్రీకాంత్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వర్సిటీ పూర్వ విద్యార్థిగా వర్సిటీ అభివృద్ధి కోసం సహకారం అందిస్తున్నారన్నారు. రాష్ట్రంలోనే కాకుండా దేశంలోనే ఉన్నతంగా గుర్తింపు సాధించే విధంగా ఎస్వీయూను తీర్చిదిద్దాలని, అందుకు కృషి చేయాలని విసికి మంత్రి చెప్పారు.

ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టండి: జెసి


రవాణా అధికారులతో సమీక్షిస్తున్న జెసి

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: జిల్లాలో రహదారి ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖలు సమన్వయంతో పక్కా ప్రణాళికతో కృషి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ సూచించారు. స్థానిక జెసి సమావేశ హాల్ లో జిల్లా రహదారి భద్రతా కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. జిల్లాలో జరిగిన ప్రమాదాలకు గల కారణాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ప్రాజెక్టు డైరెక్టర్, నేషనల్ హైవే వారు తిరుపతి బైపాస్‌లో ప్రమాదాలు నివారించేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అత్యవసరంగా ఆగిపోయిన వాహనాలను వెంటనే తొలగించేందుకు తగు చర్యలు తీసుకోవాలని, డ్రైవర్ విశ్రాంతి తీసుకునేందుకు స్థలాన్ని గుర్తించి వాటి నిర్మాణానికి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తిరుపతి బైపాస్ జంక్షన్ లో సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. బర్డ్ ఆసుపత్రిని "స్టేట్ ఆర్ట్ ఆఫ్ ఎక్సలెన్స్ హాస్పిటల్ "గా ఏర్పాటు చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా రవాణా శాఖ అధికారి కె. సీతారామి రెడ్డి, తిరుపతి ట్రాఫిక్ డీఎస్పీ నరసప్ప, గూడూరు రవాణా శాఖ అధికారి ఆది నారాయణ పాల్గొన్నారు.

క్రైం న్యూస్

మద్యం అక్రమ రవాణా పట్టివేత


మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా తీసుకొస్తున్న 30 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసు కున్నట్లు గూడూరు రూరల్ ఎస్ఐ మనోజ్ కుమార్ తెలిపారు. గూడూరు రూరల్ పోలీసు స్టేషన్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ గూడూరు పట్టణంలోని చవటపాలెం లో అక్రమ మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. రాత్రి 12 గంటల సమయంలో ఈ దాడులు నిర్వహించామని, 30 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకుని ఓ వ్యక్తిని అరెస్టు చేశామని తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా 30 మద్యం బాటిళ్లు తీసుకొస్తుండగా వాటిని స్వాధీనం చేసుకుని వారిపై పై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. అక్రమంగా మద్యం నిల్వ ఉంచుకున్న అమ్మినా చట్టరీత్యా నేరమని ఈ విషయాన్ని ప్రజలు గమనించాలన్నారు. ఎక్కడైనా అక్రమంగా పేకాట నిర్వహించిన కోడి పందాలు నిర్వహించిన మద్యం విక్రయాలు జరిగిన తమకు సమాచారం ఇవ్వాలని వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

కోడి పందెం రాయుళ్ల అరెస్ట్

ప్రజాశక్తి -కోట : కోట మండలంలోని గోవిందపల్లి ప్రాంతం సమీపంలో కోడి పందెం ఆడుతుండగా శుక్రవారం దాడులు జరిపామని, ఈ దాడుల్లో చాకచక్యంగా ఇద్దరిను అరెస్టు చేసి, ఒక కోడిని, వారి నుండి 2020 రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ నాగబాబు తెలిపారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ మండలంలో కోడి పందేలు జరగకుండా నిఘా ఉంచుతామని తెలిపారు. ఒకవేళ చట్ట విరుద్ధంగా కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బావిలో పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి


బావిలో పడి మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

ప్రజాశక్తి -రామచంద్రాపురం: బావిలో పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. రామచంద్రాపురం మండలం నీ రామాపురం గ్రామ సమీపంలో శ్రీ బ్రహ్మర్షి గురుజీ ఆశ్రమం కు ఎదురుగా ఉన్న వ్యవసాయ బావిలో వ్యక్తి రెండు రోజుల క్రితం పడి చనిపోయినట్టు దుర్వాసన రావడంతో స్థానికులు బావిలో పరిశీలించారు. వ్యక్తి మృతదేహం బావిలో తేలి ఉండడాన్ని గమనించి స్థానికులు శుక్రవారం ఉదయం 11 గంటలకు పోలీసులకు సమాచారం ఇచ్చారు. స్థానిక ఎస్ఐ ఎస్ గిరిబాబు తన సిబ్బంది తో సంఘటనా స్థలాని కి చేరుకుని బావి నుంచి మృతదేహాన్ని వెలికి తీయించారు. మృతదేహాన్ని పరిశీలించగా ఎలాంటి అచూకీకి సంబంధించి ఆధారాలు లభించలేదు. మృతుడు చేతికి స్టీల్ కడియం, కాళ్లకు బూట్లు, బ్లూ పాయింటు, షర్టు ధరించి ఉన్నాడు. ఆ వ్యక్తి మృతి అనుమానాస్పదంగా ఉందని స్థానికులు అంటున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి వివరాలు తెలిస్తే ఫోన్ నెంబర్ 9440796731కు తెలపాలని ఎస్ఐ గిరిబాబు పేర్కొన్నారు.ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్టోన్ క్వారీ లేబర్ సొసైటీ అధ్యక్షుడికి ఘన సన్మానం


స్టోన్ క్వారీ లేబర్ సొసైటీ అధ్యక్షుడు శ్రీనివాసులును సన్మానిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణానికి స్థానిక స్టోన్ క్వారీ లేబర్ సొసైటీ అధ్యక్షుడిగా గేటు పుత్తూరుకు చెందిన శ్రీనివాసులును ఎన్నుకున్నారు. టిడిపి నగరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గాలి భానుప్రకాష్ ను శుక్రవారం ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా భాను ప్రకాష్ మాట్లాడుతూ పుత్తూరు చుట్టు పక్కల స్టోన్ క్రషర్‌లో పనిచేసే కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలని నూతనంగా ఎంపికైన శ్రీనివాసులుకు సూచించారు. కార్మికుల సమస్యల పరిష్కారంలో తాను సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా భాను ప్రకాష్, నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు శ్రీనివాసులును దుశ్శాలువాతో, పూలదండలతో అభినందించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ డీజే దనపాల్, వీకే వేలాయుధం, వీకే నారాయణమూర్తి, వీకే కాశీనాథన్ పాల్గొన్నారు.

నారాయణ కళాశాల అధ్యాపకునికి డాక్టరేట్


బి మాలకొండారెడ్డి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాల, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన బి మాలకొండారెడ్డి శుక్రవారం కె.ఎల్ యూనివర్సిటీ, విజయవాడలోని ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ డిపార్ట్ మెంట్ నుండి డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పిహెచ్‌డి) పట్టా పొందారని నారాయణ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి రవిప్రసాద్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ బి మాలకొండారెడ్డి మాట్లాడుతూ తన థీసిస్ శీర్షిక 'ఇమేజ్‌ఫ్యూజన్ డ్రోన్స్ ఆప్టిమైజేషన్ అల్గారిథమ్‌లను ఉపయోగించి సింథటిక్ ఎపర్చర్ రాడార్ ఇమేజ్‌లలో ఆటోమేటిక్ టార్గెట్ డిటెక్షన్' అని తెలిపారు. తాను పరిశోధన చేసిన థీసిస్ సమర్పించినందుకు పిహెచ్‌డి ని ప్రదానం చేశారని తెలిపారు. ఈ పరిశోధనలో సమయం, వ్యాపారాలు, ప్రభుత్వ ఏజెన్సీలకు, పంట పండించడం, లాజిస్టిక్స్, రవాణా, మంచు, మంచు డైనమిక్స్, నేలలో తేమ మార్పులు, ప్రకృతి వైపరీత్యాలు (వరదలు, భూకంపాలు, అగ్నిపర్వతాలు) మొదలైన ప్రపంచ వ్యాప్త ప్రక్రియల గురించి వివరణాత్మక అవగాహనను అందిస్తుందన్నారు. తనకున్న విధాలుగా సహాయ సహకారాలు అందించిన కళాశాల యాజమాన్యానికి, అధ్యాపకులకు, కుటుంబ సభ్యులకు, ప్రత్యేకంగా గైడ్ అయిన డాక్టర్ మహ్మద్ జియా ఉర్ రెహమాన్ కి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ప్రిన్సిపల్ డాక్టర్ వి రవి ప్రసాద్ మాట్లాడుతూ నారాయణ ఇంజనీరింగ్ కళాశాల, గూడూరు అధ్యాపకులు పరిశోధన చేయటంలో అన్ని విధాల సహాయ సహకారాలు అందించడమే కాకుండా అన్ని వనరులు అందిస్తామని పేర్కొన్నారు. అనంతరం డాక్టర్ బి.మాల కొండారెడ్డి కి అభినందనలు తెలిపారు.

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ


ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేస్తున్న జడ్‌పీ ఫైనాన్స్ కమిటీ సభ్యులు సుమన్‌కుమార్

ప్రజాశక్తి-నారాయణవనం: మండలంలోని పాలమంగళం సచివాలయం పరిధిలోని జడ్పీ హైస్కూల్లో కొత్త ఆరోగ్యశ్రీ కార్డులను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి జడ్పిటిసి, జడ్పీ ఫైనాన్స్ కమిటీ మెంబర్ కోనేటి సుమన్ కుమార్ ముఖ్య అతిథు లుగా హాజరై ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కొత్త ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా లబ్ధి 5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్స్ దర్శిత్ రాజ్, ఎంపీడీఓ కృష్ణమూర్తి, ఎంఈఓ ప్రభాకర్ రాజు, ఏ ఓ గుణశేఖర్, ఛైర్మన్ సుబ్రహ్మణ్యం, చర్పంచ్ సాయిరవి, లబ్ధిదారులు. ప్రజాప్రతినిధులు, మెడికల్ స్టాఫ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు: సిఐ


మాట్లాడుతున్న సిఐ హాజరత్‌బాబు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణ ప్రజలందరూ నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించాలని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు చేపడతామని ఒకటవ పట్టణ సీఐ హజరత్ బాబు హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 31 రాత్రి 10 గంటల నుంచి అర్ధరాత్రి 12గంటలు వరకు మాత్రమే సంబరాలు చేసుకునేందుకు అనుమతి ఉందన్నారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా నిర్వాహకులు లౌడ్‌స్పీకర్లు, మ్యూజిక్ సిస్టమ్ వినియోగించేందుకు విధిగా సంబంధిత పోలీస్ అధికారుల వద్ద ముందస్తు అనుమతి తీసుకోవాలని సూచించారు. వేడుకల్లో భాగంగా అశ్లీల నృత్యాలు, అసాంఘిక కార్యకలాపాలు లేకుండా నిర్వహించ ుకోవాలన్నారు. నూతన సంవత్సర వేడుకల్లో ప్రమాదకర విన్యాసాలు, పేలుడు పదార్థాలు వినియోగించ కూడదన్నారు. అతిగా మద్యం సేవించి మితిమిరిన వేగంతో వాహనాలు నడిపేవారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మహిళలు ఒంటరిగా ఉన్న ప్రాంతాల్లోకి వెళ్లి వారిపై వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని, నూతన సంవత్సరం సందర్భంగా ఎవరైనా మద్యంతాగి వాహనాలు నడిపితే కేసులు నమోదుచేసి జైలుకు పంపిస్తామన్నారు. గూడూరు వన్ టౌన్ పరిధిలో వాహనాలు తనిఖీ చేస్తామని తెలిపారు. రాత్రి 12 తర్వాత ఎవరూ రోడ్లపై కనిపించ కూడదని పేర్కొన్నారు.

రైతులకు అవగాహనా సదస్సు

ప్రజాశక్తి -కెవిబిపురం: కెవిబి పురం మండలం కాట్రాపల్లి గ్రామ పంచాయతీలో అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ప్రసాద్ రైతులతో మాట్లాడుతూ పశువులకు సకాలంలో టీకాలు వేయించాలని తర్వాత పాలు ఇచ్చే పశువులకు సబ్సిడీ ద్వారా దానా తీసుకున్న రైతులను దానా గురించి అడిగి తెలుసుకున్నారు. దూడల పెంపకం గురించి పశువులకు వచ్చే వ్యాధుల గురించి వివరించారు. రైతు భరోసా కేంద్రంలో పశు వైద్య సిబ్బంది ఎప్పుడూ అందుబాటులో ఉంటారని పశువులకు ఏ ఇబ్బంది కలిగినా వెంటనే పశు వైద్య సిబ్బందికి తెలపాలని వైయస్సార్ ఆరోగ్య కార్డులు రైతులకు పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ వైఎస్ఆర్ రైతు భరోసా కేంద్రంలో పశువైద్య సిబ్బందిని ఉపయోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ పశు వైద్యాధికారి డాక్టర్ ఆవుల ప్రసాద్, కాట్రాపల్లి సర్పంచ్ సురేంద్ర, గోపాల్ మిత్ర, అవ సరం సురేష్ , కెవిబి పురం వైయస్సార్ రైతు భరోసా, పశువైద్య సిబ్బంది, మునీంద్ర, రైతులు పాల్గొన్నారు.

టిడిపిలో పలువురి చేరిక

ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: స్థానిక ఎగవూరు పంచాయతీలో శుక్రవారం నిర్వహించిన 'గడపగడపకు మీ పులివర్తి నాని' సందర్భం గా పులివర్తి నాని కుమారుడు పులివర్తి వినీల్ సమక్షంలో పలువురు టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. మెండ్రి సాంబయ్య, బి ముని రాజ, బి సుబ్రమణ్యం, రిటైర్ టీచర్ మునిరాజ, సోమసుందరం, పోకల చంద్రశేఖర్, బి చలపతి, సలివెందుల పురుషోత్తం, జి సరోజమ్మ, జి రెడ్డెప్పకు వినీల్ కండువాలు కప్పి టిడిపిలోకి ఆహ్వానించారు.రాష్ట్ర అభివృద్ధికి చంద్రబాబు, నియోజకవర్గ అభివృద్ధికి పులివర్తి నానితోనే సాధ్యమన్న వైసీపీ సానుభూతి పరులన్నారు. 2024లో పులివర్తి నాని గెలుపే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. '

'నారాయణ'లో బిఐఎస్ స్టాండర్ క్లబ్ ప్రారంభోత్సవం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో బిఐఎస్ స్టాండర్ క్లబ్ ప్రారంభోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్టాండర్ క్లబ్ మెంటర్ కెవికిషోర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానంతో పాటు ప్రమాణాలవైపు విద్యార్థులకు అవగాహన కల్పించారు.కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి రవిప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. విష్వక్సేనారెడ్డి మాట్లడుతూ విద్యార్థులకు ప్రమాణాలతో పాటు సాంకేతిక ప్రాముఖ్యతను తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఈఈ హెచ్‌ఓడీ, బిఐఎస్ స్టూడెంట్స్ క్లబ్ మెంబర్ డాక్టర్ కెపి ప్రసాదరావు , ఎట కొండా రెడ్డి పాల్గొన్నారు.

చేనేత పరిశ్రమను ఆదుకోవాలి

- చిత్తూరు పార్లమెంటు టీడీపీ ఉపాధ్యక్షుడు గంజి మాధవయ్య


మాట్లాడుతున్న టిడిపి నాయకులు గంజి మాధవయ్య

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : చేనేత పరిశ్రమను ఆదుకోవాలని చిత్తూరు పార్లమెంటరీ టిడిపి ఉపాధ్యక్షుడు గంజి మాధవయ్య పేర్కొన్నారు. మంగళగిరి టిడిపి కార్యాలయంలో ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన చేనేత ముఖ్యుల ఆత్మీయ సమావేశానికి ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రతినిధిగా చిత్తూరు పార్లమెంటు టిడిపి ఉపాధ్యక్షుడు గంజి మాధవయ్య హాజరయ్యారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ చేనేత పరిశ్రమ ప్రస్తుతం బాగా దెబ్బ తిందని, తిరిగి చేనేత అభివృద్ధి చెందాలన్నా ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం చేనేత ఉత్పత్తులపై విధిస్తున్న 5 శాతం జిఎస్టీని రద్దు చేయాలని లేదా రాష్ట్ర ప్రభుత్వం భరించాలన్నారు. పవర్‌లూమ్ ద్వారా తయారయ్యే చేనేతల ఉత్పత్తులను నియంత్రించడం ద్వారా చేనేత పరిశ్రమను అభివృద్ధి చేయవచ్చని పేర్కొన్నారు. కొత్తగా ఈ పరిశ్రమకి వచ్చే వారికి శిక్షణ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ పరిశ్రమకు ముడిసరుకును ప్రభుత్వం రాయితీ ధరల ఇప్పించాలని 50 సంవత్సరాలకు ఇస్తున్న చేనేత పెన్షన్లను సరళతరం చేయాలని సూచించారు. ప్రతి చేనేత కుటుంబానికి సొంత ఇల్లు కట్టించి కార్మికుడికి ఆరోగ్య భద్రత కల్పించాలన్నారు. రైతును ఆదుకున్నట్లే చేనేత కార్మికుడు మరణించినా ఎక్కువ మొత్తం ఆర్థికసాయం అందించి ఆదుకోవాలన్నారు. నగరి, పుత్తూరులలో పర్యటించినప్పుడు చంద్రబాబు నాయుడు , లోకేష్ హామీ ఇచ్చిన విధంగా పవర్‌లూమ్ కార్మికులకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ ను అమలు చేయాలని కోరారు.

1న పిఎస్‌ఎల్వి సి-58 రాకెట్ ప్రయోగం

ప్రజాశక్తి-సూళ్లూరుపేట: అంతరిక్ష పరిశోధనలో అగ్రరాజ్యాలకు దీటుగా దూసుకుపోతున్న ఇస్రో 2024 జనవరి 1న మరో కీలక ఉపగ్రహ ప్రయోగానికి సిద్ధమయింది. శ్రీహరికోటలోని ఫస్ట్ లాంచ్ ప్యాడ్ నుంచి పిఎస్ఎల్వి–సి 58 రాకెట్ ప్రయోగిస్తున్నారు. దీని ద్వారా 480 కిలోల బరువు ఉన్న ఎక్స్ పో శాట్ ను, కేరళ యూనివర్సిటీ విద్యార్థులు రూపొందిం చిన ఒక కేజీ బరువున్న వీఐవై శాటును ప్రయోగిస్తున్నారు. గత ఏడాది వరసగా ఎనిమిది రాకెట్ల ప్రయోగాలు శ్రీహరికోట నుంచి శాస్త్రవేత్తలు విజయవంతంగా చేపట్టారు. 20 24లోనూ సక్సెస్ తో ఈ రాకెట్ ను గురి తప్పకుండా విడిచి పెట్టాలని ఆశిస్తున్నారు. ఇందుకు సంబంధించి ఇస్రో సందర్శకులను ఆహ్వానించింది. ఆన్లైన్ ద్వారా షార్ లోని విజిటర్స్ గ్యాలరీ నుంచి వీక్షకులను దరఖాస్తులు ఆహ్వానించింది. ఇదిలా ఉంటే ఐదేళ్ల జీవితకాలం కలిగిన ఎక్స్ పో శాటిలైట్ ఒక విభిన్నమైనది. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఎక్స్ కిరణాల ధ్రువాన్ని అధ్యయనం చేయడం కోసం దీన్ని రూపొందించింది. బెంగళూరులోని యు.ఆర్ రావు శాటిలైట్ సెంటర్లో తయారు చేసిన ఈ ఉపగ్రహాన్ని ఇప్పటికే శ్రీహరికోటకు తీసుకొచ్చి రాకెట్ నందు అనుసంధానం పనులు చేపట్టారు. భూమికి 650 కిలోమీటర్ల తక్కువ దూరంలో పిఎస్ఎల్వి –సి 58 రాకెట్ ఈ ఉపగ్రహాన్ని విడిచి పెట్టేలా ప్రణాళికలు రూపొందించారు. టెలిస్కోప్ లాగా పని చేసే ఈ ఉపగ్రహ సేవలో మన దేశానికి ఎంతో ఉపయోగపడతాయని శాస్త్రవేత్తలు పేర్కొంటు న్నారు. పిఎస్ఎల్వి –సి 58 రాకెట్ ప్రయోగం తర్వాత ఆ వెంటనే జి ఎస్ ఎల్ వి మార్కు– 2 ప్రయోగాన్ని కూడా ఇస్రో చేపట్టనుంది.

మహిళా సాధికారతతోనే దేశాభివృద్ధి..

ప్రజాశక్తి - క్యాంపస్: మహిళా సాధికారత ద్వారానే దేశాభివద్ధి సాధ్యమని ఆంధ్ర ప్రదేశ్ ఉన్నత విద్యా మండలి డిప్యూటీ ఛైర్‌పర్సన్ ఆచార్య పి. ఉమామహేశ్వరి దేవి పేర్కొన్నారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ఉమెన్ స్టడీస్, న్యాయవిభాగం, నేషనల్ కమిషన్ ఫర్ వుమెన్ సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ సదస్సును శుక్రవారం సావేరి అతిథిగృహంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా వర్చువల్ పద్ధతిలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా సాధికారత కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలను ప్రవేశపెట్టాయని వెల్లడించారు.

సంక్షేమం, అభివృద్ధికి పెద్ద పీట

ప్రభుత్వ భవనాల ప్రారంభోత్సవంలో మంత్రి కాకాని గోవర్ధనరెడ్డి

ప్రజాశక్తి -తడ: మండలంలోని కాదలూరులో 1 కోటి రూపాయలతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైయస్సార్ హెల్త్ క్లినిక్, వాటర్ ప్లాంట్, అంగన్‌వాడీ కేంద్ర భవనాలను వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన రెడ్డి, సూళ్లూరుపేట శాసనసభ్యులు కిలివేటి సంజీవయ్య చేతుల మీదుగా శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సంజీవయ్య , మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ సీఎం వైయస్ జగన్ సంక్షేమంతో పాటు అభివృద్ధికి పెద్ద పీట వేస్తున్నారన్నారు. దీంతో పాటు కరోనా కష్ట కాలంలో కూడా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల ముంగిటకే అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తడ మండల అధికారులు, పోలీసులు, తడ మండల ఎంపిపి కొలవి రఘు రెడ్డి, తడ మండల సర్పంచ్, కన్వీనర్ కె ఆర్ముగం, తడ మండల జేసియస్ కన్వీనర్ ఆర్‌కె సుందర్ రెడ్డి, తడ జడ్‌పిటిసి హిందూమతి, బిసి సెల్ అధ్యక్షులు మునుస్వామి రెడ్డి, మాజీ సర్పంచ్ రోజారత్నం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అట్టహాసంగా తడ మార్కెట్ యార్డ్ పాలకవర్గ ప్రమాణ స్వీకారం


పమాణ స్వీకారం చేస్తున్న తడ మార్కెట్ యార్డు పాలక మండలి సభ్యులు

ప్రజాశక్తి - తడ: మండలంలోని పులివేంద్ర గ్రామంలోని మార్కెట్ యార్డు నూతన పాలక మండలి సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి సమక్షంలో శుక్రవారం అట్టహాసంగా సాగింది. మార్కెట్ యార్డ్ ఛైర్మన్ గా పర్వత రెడ్డి కవిత ప్రభాకర్ రెడ్డి , వైస్ ఛైర్మన్ నాగరాజు రెడ్డి, పాలకవర్గం సభ్యులు శోభన్ బాబు, ప్రసాద్ నాయుడు, నీరజ, వీరస్వామి, కల్పన రాజశేఖర్, అమరావతి, బట్ట చెంచలక్ష్మి, చంద్రయ్య, పెంచలమ్మ, గంగమ్మ, ప్రకాష్, వెంకట శేషగిరిరావు, నరేష్ కుమార్ వద్ద ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమం మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజీవయ్య మాట్లాడుతూ రైతు సమస్యలపై అవగాహన, సమస్యల పరిష్కారంలో నిబద్ధత కలిగిన సభ్యులు పాలక మండలిలో ఉన్నారని కొనియాడారు. రాష్ట్రంలోనే తడ మార్కెట్ యార్డ్ అతి త్వరలో ఆదర్శంగా నిలుస్తుందన్నారు. రైతే రాజు దిశగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేపడుతున్న కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో తడ మండల అధికారులు, పోలీసులు, తడ ఎంపీపి కొలవి రఘు రెడ్డి, తడ సర్పంచ్, కన్వీనర్ కె ఆర్ముగం, తడ మండల జేసియస్ కన్వీనర్ ఆర్‌కె సుందర్ రెడ్డి, తడ జడ్‌పిటిసి హిందూమతి, బీసీ సెల్ అధ్యక్షులు మునుస్వామి రెడ్డి, మాజీ సర్పంచ్ రోజారత్నం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్వీయూ విసికి అభినందనల వెల్లువ

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం నూతన ఉపకులపతిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన మనోవిజ్ఞాన శాస్త్ర ఆచార్యులు ఆచార్య వంగిమల శ్రీకాంత్ రెడ్డి కి శుక్రవారం పలువురు విద్యార్థి సంఘాల నేతలు, ఉద్యోగ సంఘాలు ఉద్యోగ సంఘాల నేతలు, విద్యార్థులు, పరిశోధకులు, రాష్ట్రస్థాయి అధికారులు అభినందనలు తెలిపారు. ఇందులో భాగంగా శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య డి. భారతి, రిజిస్ట్రార్ ఆచార్య ఎన్. రజిని, శ్రీ పద్మావతి మహి ళా విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి, రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్ పర్సన్ ఆచార్య శెట్టిపల్లి రత్నకుమారి, ఆచార్య నాగిరెడ్డి, పలు డిగ్రీ కళాశాల యాజమాన్యాలు, డైరెక్టర్లు, ప్రిన్సిపాల్‌లు పుష్పగుచ్ఛాలు, దుశ్శాలువలతో విసిని ఘనంగా సత్కరించారు.

బిసిలకు టిడిపి అండ: బుజ్జి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : అనాదిగా అణచివేతకు గురవుతున్న వెనుకబడిన వర్గాలకు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ప్రాధాన్యత కల్పించి, వారి పురోభివృద్ధికి బాటలు వేసి గడిచిన నలభై సంవత్సరాలుగా బిసి లకు అండగా నిలబడింది టిడిపియే నని ఆ పార్టీ సాంస్కృతిక విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నెమళ్ళూరు బుజ్జి కొనియాడారు. 'బాబు ష్యూరిటీ – భవిష్యత్తు గ్యారంటీ' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం 52 వ బూత్ పరిధిలోని ఇందిరా నగర్, పూసల వీధి తదితర ప్రాంతాల్లో నాయకులు పాల్గొన్నారు. కులవృత్తులపై ఆధారపడి జీవనం సాగించే కొన్ని లక్షల మంది వెనుకబడిన వర్గాలకు గత నాలుగున్నర సంవత్సరాలుగా ఉపాధి అవకాశాలు లేకుండా చేసి, రాజకీయ వేధింపులకు గురిచేస్తూ వారి జీవితాలను నరక ప్రాయం చేసిన జగన్ రెడ్డి ప్రజా కంటక పాలనకు ఘోరీ కట్టడానికి రాష్ట్రంలోని బిసి వర్గాలు కంకణబద్ధులై ఉన్నారన్నారు. రాష్ట్ర కార్యదర్శి డా.జి.దశరధాచారి, గోపీ, బిసి వెల్ఫేర్ జెఎసి రాష్ట్ర కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు పాల్గొన్నారు.

యువకులకు క్రీడా స్ఫూర్తి అవసరం

పజాశక్తి - బాలాయపల్లి: యువకులకు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని వైసిపి మండల కన్వీనర్ జయంపు సహకార సంఘం అధ్యక్షుడు వెందోటి కార్తీక్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని జయంపు గ్రామంలో ఆడుదాం ఆంధ్ర క్రీడల్లో భాగంగా యువకులు వాలీబాల్, ఖోఖో ఆటలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందు ఉండాలని వైసిపి మహిళా అధికార ప్రతినిధి రావి దేవికా చౌదరి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'ఆడదాం ఆంధ్ర' అనే కార్యక్రమంలో భాగంగా ఖోఖో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రమీల రాణి ప్రధానోపాధ్యా యులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి -రేణిగుంట : మండలంలోని విప్పమాను పట్టడలో 'ఆడుదాం ఆంధ్ర' పోటీలను సర్పంచ్ లక్ష్మీపతి రెడ్డి శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. క్రీడల్లో భాగంగా విప్పమానుపట్టెడలో మొదట వాలీబాల్ పోటీలు , షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. మధ్యాహ్నం నుండి గ్రామపంచాయతీ తండ్లం విప్పమానిపట్టడ గ్రామ పంచాయతీకి క్రికెట్ పోటీలు, కబడ్డీ, ఖోఖో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది, గ్రామ సచివాలయ వాలంటీర్లు, గ్రామ యువత, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

'రెడ్ బకెట్ బిర్యానీ' ప్రారంభం


బిర్యాని సెంటర్‌ను ప్రారంభిస్తున్న మేయర్ శిరీష

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: తిరుపతి నగరంలో నూతనంగా ఏర్పాటు చేసిన రెడ్ బకెట్ బిర్యానీ బ్రాంచ్ ని నగర మేయర్ డాక్టర్ శిరీష శుక్రవారం ప్రారంభించారు. స్థానిక లీలామహల్ సర్కిల్ సమీపంలోని ఎస్‌బిఐ బ్రాంచ్ పక్కన ఏర్పాటు చేసిన రెడ్ బగ్ బిర్యానీ బ్రాంచ్ వద్ద జ్యోతి ప్రజ్వలన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ బ్రాంచ్ నిర్వాహకులు మాట్లాడుతూ ప్రముఖ రెడ్ బకెట్ బిర్యానీ సంస్థ దక్షిణ భారతదేశంలో సుమారు 180 బ్రాంచ్ లు కలిగి ఉందన్నారు. రుచికరమైన బిర్యాని అందించడంలో ఈ సంస్థ ప్రసిద్ధి చెందిందన్నారు. తిరుపతిలో మొట్టమొదటిసారిగా ఈ బ్రాంచ్ ని ఏర్పాటు చేయడం సంతోష్కరమన్నారు. కేవలం 129 రూపాయలు నుంచే చికెన్ బిర్యానీ అందుబాటులో ఉంటుందన్నారు. సింగల్, ఇద్దరికీ, ముగ్గరికి, నలుగురుకి, ఐదుగురికి, 10 పదిమంది చొప్పున ఫ్యామిలీ ప్యాక్ లు అందుబాటులో ఉన్నాయన్నారు. రుచి, శుచి విషయంలో రాజీ లేకుండా, అన్ని రంగాల ప్రజలు మెచ్చే విధంగా బిరియాని అందుబాటులో ఉంచామన్నారు. అనుభవజ్ఞులైన పాకశాస్త్ర ప్రవీణులచే ఆహార పదార్థాలు తయారు చేస్తున్నామన్నారు. తమ వద్ద చికెను, మటన్, ఫిష్, రొయ్యలు, వెజ్ బిర్యానీ, చికెన్, మటన్ పకోడీలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టౌన్ బ్యాంక్ చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి, ఆర్ బి బి నిర్వాహకులు రవీంద్రారెడ్డి, సురేష్ రెడ్డి, ప్రకాష్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు.

తాగు నీటి పైపులైను లీకేజీ

- రోడ్డు బురదమయం- అధికమవుతున్న దోమలు - ప్రజలు భయాందోళన


తాగునీటి పైపులైను లీకేజీతో బురదమయమైన రహదారి

ప్రజాశక్తి -బుచ్చినాయుడు కండ్రిగ: సత్యవేడు నియోజకవర్గం బుచ్చి నాయుడు కండ్రిగ మండలం పుతేరి సచివాలయం పరిధిలోని బీసీ కాలనీలో నీటి సదుపాయం కోసం అమర్చిన విద్యుత్ మోటా ర్ వద్ద వున్న డెలివరీ పైపు లీకేజీ ఏర్పడడం వల్ల నీళ్లు రోడ్డుపై చేరి బురదమయమై క్రిమి కీటకాలు, దోమలు అధికమవుతున్నాయి. ఈ కారణంగా స్థానికులు వివిధ వ్యాధులు వచ్చే ప్రమాదం వుందని భయాందోళనకు గురవుతున్నారు. సచివాలయ అధికారులు చూస్తూ వెళుతున్నారే తప్ప సమస్యను పరిష్కరించడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. తాము వ్యాధుల బారిన పడక ముందే సంబంధిత సచివాలయ అధికారులు నిద్రావస్థను వీడి సమస్యను గుర్తించి డెలివరీ పైపు వద్ద ఏర్పడిన లీకేజీని గుర్తించి అరికట్టాలని స్థానిక కాలనీవాసులు కోరుతున్నారు.

ట్రాన్స్ డెంటల్ మెడిటేషన్‌కి తరలిన విద్యార్థులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : జనవరి 12 వ తేదీ హైదరాబాద్ లోని కణ్వశాంతి వనంలో మహర్షి వేదిక్ యూనివర్సిటీ అధ్వర్యంలో నిర్వహించనున్న ట్రాన్స్ డెంటల్ మెడి టేషన్ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాల నుండి 3 వేల మంది విద్యార్థులు కళాశాల నుండి శుక్రవారం బయలు దేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ వంకి పెంచలయ్య, డైరెక్టర్ మోహన్, అధ్యాపకులు ధనుంజయ, రాజయ్య, కళాశాల ఏఓ రామయ్య పాల్గొన్నారు.

ఏపిఎంలతో సమీక్షా సమావేశం

ప్రజాశక్తి -కోట : కోట మండలంలోని స్థానిక వైయస్సార్ క్రాంతి పథకం కార్యాలయంలో స్థానిక ఏపిఎం సిహెచ్ రత్నయ్య ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయిలో ఏపిఎంలతో సమీక్షా సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలోస్థానిక కోట ఏపిఎం సిహెచ్.రత్నయ్య, చిల్లకూరు ఏపీఎం గున్నయ్య, చిట్టమూరు ఏపీఎం ఉమాదేవి, గూడూరు ఏపీఎం బుజ్జమ్మ,స్థానిక సీసీలు భాస్కర్, శంకరయ్య, ప్రసాద్, కృష్ణమ్మ, ఈఓఏలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కోటాలో ట్రాక్టర్‌ను అందించండి..

ప్రజాశక్తి -ఏర్పేడు: చింతలపాలెం గ్రామపంచాయతీ షికారుల మరాఠీపురంలోని వ్యవసాయ భూములను ఎమ్మెల్యే మధు సూదన్ రెడ్డి షికారి కుటుంబాలకు కొంత భూమిని అప్పగించారు. వ్యవసాయ భూములను సాగు చేసుకునేందుకు షికారుల కుటుంబాలకు ఎమ్మెల్యే కోటాలో వ్యవసాయ ట్రాక్టర్ ను ఇప్పించాలని షికారుల తరపున వినతి పత్రం డబ్బా పరశురాం అందించారు. ఎమ్మెల్యే సాను కూలంగా స్పందించారు.

క్రైం రేటు తగ్గింది : ఎస్‌పి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: తిరుపతి జిల్లాలో 2023 సంవత్సరంలో క్రైమ్ రేటు తగ్గిందని జిల్లా ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. స్థానిక ఓ ప్రైవేటు హోటల్లో శుక్రవారం అయిన విలేకరులతో మాట్లాడుతూ కలిసి కట్టుగా పనిచేయడంతోనే క్రైం రేటును తగ్గించగలిగామన్నారు. ఈ ఏడాది క్రైం రేట్ వివరాలను మీడియాకు వెల్లడించారు. తిరుపతి టెంపుల్ సిటీ లో శాంతిభద్రతలను అదుపులోనే ఉంచాం, ఎన్ ఫోర్స్ మెంట్, విజిబుల్ పోలీసింగ్ బలోపేతం చేశామన్నారు.